నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 29 ఆగస్టు 2024 | ADILABAD NIRMAL

ఎమ్మెల్సీ కవితకు బెయిల్‌పై బీఆర్ఎస్ నాయకుల హర్షం

స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

ఖానాపూర్, ఆగస్టు 28: నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్‌పై విడుదల కావడంపై ఖానాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని జగన్నాథ్ చౌరస్తాలో తెలంగాణ విగ్రహానికి పూలమాలలు వేసి పటాకులు కాల్చి సంబురాలు నిర్వహించారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఆధారాలు లేకుండా ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసులు పెట్టారని, అయినా న్యాయమే గెలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గౌరికర్ రాజు, నాయకులు రామునాయక్, శ్రావణ్, మొయిద్, ఖలీల్, ప్రదీప్, మహిపాల్, నగేశ్, దివాకర్, శ్రీధర్, రాజన్న, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ ఎదుట ఆక్రమణల తొలగింపు

ఆక్రమణలు తొలగించిన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

ఎదులాపురం, ఆగస్టు 28 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ప్రధాన గేటు వద్ద కొందరు వ్యాపారులు స్థలాన్ని ఆక్రమించుకోగా బుధవారం పోలీసులు ఆక్రమణలను తొలగించారు. రిమ్స్ వైద్యులు, సిబ్బంది, వైద్య విద్యార్థుల భద్రతలో భాగంగా ఇటీవల పోలీసు అధికారులు, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యాధికారులు దవాఖానలోని వివిధ ప్రాంతాలను పరిశీలించారు. గేటు ముందు స్థలాన్ని కొందరు ఆక్రమించుకొని దుకాణాలు ఏర్పాటు చేయడంతో పోలీసులు వాటిని తొలగించారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ కరుణాకర్‌రావు ఆ స్థలాన్ని పరిశీలించి గేటు ముందు ఎలాంటి దుకాణాలు ఏర్పాటు చేయవద్దని సూచించారు.

రుణమాఫీ జరిగేనా?

- క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభం
- రైతుల వివరాలు సేకరిస్తున్న అధికారులు
- ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు

ఆదిలాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల రుణమాఫీ అర్హులైన రైతులకు అందకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అర్హులైన రైతులకు రుణమాఫీ అందించేందుకు ప్రతి మండలానికీ ఒక నోడల్ అధికారిని నియమించింది. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ రైతుల వద్ద నుంచి వివరాలు సేకరిస్తున్నారు. రేషన్ కార్డు లేని రైతుల కుటుంబాల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు సేకరించి ప్రత్యేకంగా రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

వెల్లువలా ఫిర్యాదులు

రూ. 2 లక్షల రుణమాఫీలో భాగంగా ప్రభుత్వం ఈ నెల 15న మూడో విడుత రైతుల పంట రుణాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. మొదటి విడుతలో రూ. 1 లక్ష వరకు 18,821 మంది రైతులకు రూ. 120.79 కోట్లు, రెండో విడుతలో రూ.1.50 లక్షల రుణం 17,647 మంది రైతులకు 201.83 కోట్లు, మూడో విడుతలో 19,493 మంది రైతులకు రూ.288.26కోట్లు మాఫీ అయ్యాయి. జిల్లాలో మూడు విడుతల్లో 55,961 మంది రైతులకు రూ.608.88 కోట్లు రద్దు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. పలు కారణాలతో రుణమాఫీ జరగకపోవడంతో ప్రభుత్వం రైతు వేదికల్లో వ్యవసాయ శాఖ అధికారులను అందుబాటులో ఉంచి రైతుల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా 3,717 మంది రైతులు తమకు రుణమాఫీ జరగలేదని దరఖాస్తు చేసుకున్నారు. కుటుంబాల నిర్ధారణ జరగకపోవడం, రేషన్‌కార్డు లేకపోవడం, ఆధార్ సమస్యలు, పేర్లు తప్పుగా నమోదు, బ్యాంకు తప్పిదాలు, రూ. 2 లక్షలకు పైగా లోన్ ఉండడం, ఇతర కారణాలు అర్హులైన రైతులకు రుణమాఫీ జరగకపోవడానికి కారణమయ్యాయి.

ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయిలో రైతుల ఫొటో తీస్తున్న వ్యవసాయశాఖ అధికారి

గ్రామాల్లో రైతుల వివరాల సేకరణ

రుణమాఫీలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు రైతుల వద్ద నుంచి పలు వివరాలు సేకరిస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది రైతు కుటుంబంతో ఫొటో తీసుకుని యాప్‌లో నమోదు చేస్తున్నారు. కుటుంబ యజమాని నుంచి ధ్రువీకరణ పత్రంతోపాటు రుణఖాతా, బ్రాంచ్ వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే రుణమాఫీ కాని రైతులు ఈ సారైనా తమ బ్యాంకు లోన్ మాఫీ అవుతుందా ? అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆలూరులో అరకొర మాఫీ

400మందిలో 150మందికి కూడా మాఫీ కాలే

- రేషన్‌కార్డు లేదని చాలామందికి నష్టం
- అర్హులున్నా అందని రుణమాఫీ సాయం
- మేమేం పాపం చేశామంటున్న రైతులు
- అధికారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

సమస్యలపై పోరాడేందుకు ఈ నెల 27న సమావేశమైన రుణమాఫీ కాని రైతులు

నిర్మల్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): పల్లెల్లో ఇప్పుడు ఏ నలుగురు కలిసినా ఒకటే ముచ్చట. నీకు రుణమాఫీ అయిందా..? అంటే నీకు మాఫీ అయిందా..? రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ చేశామని సీఎంతో పాటు మంత్రులంతా గొప్పలు చెబుతుంటే, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. రుణమాఫీపై ఒక్కో ఊరిది ఒక్కో గాథ. నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలం ఆలూర్ గ్రామంలో ఎంత మంది రైతులకు రుణమాఫీ జరిగిందో తెలుసుకునేందుకు మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన 'నమస్తే తెలంగాణ'కు ఎవరిని కదిలించినా రుణమాఫీ వెతలే కనిపించాయి. మాకు మాఫీ జరగలేదని, తమ పేర్లను పేపర్లో వచ్చేలా చేసి రుణమాఫీ జరిగేలా సాయపడమని గుంపులు గుంపులుగా రైతులు ఎగబడ్డారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఒక్కరిద్దరికి కాదు ఏకంగా 250 మందికి పైగా రైతులు రుణమాఫీ కాలేదు. ప్రభుత్వం పెట్టిన ఆంక్షలన్నింటికీ సరిపోతున్నా ఎందుకు రుణమాఫీ కాలేదో ఎవరూ చెప్పలేకపోతున్నారు. దీంతో రైతులు చేసేదేమీ లేక అధికారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఒక వైపు వేసిన పంటలను కాపాడుకోవడం, మరోవైపు రుణమాఫీ కాక అన్నదాతలు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. గ్రామంలో దాదాపు 400 మంది వరకు పంట రుణాలు తీసుకున్నట్లు చెబుతున్నారు. కొందరు గ్రామంలోని పీఏసీఎస్ ద్వారా రుణాలు తీసుకోగా, మరికొందరు నిర్మల్ పట్టణంలోని యూనియన్ బ్యాంకులో తీసుకున్నారు. ఈ గ్రామంలో 35శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదంటున్నారు. మాఫీ కాని వారిలో కొందరు రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలు తీసుకున్న వారున్నారు. రూ.2 లక్షలకు పైగా అప్పులు తీసుకున్న రైతులపై మొత్తాన్ని చెల్లిస్తేనే మాఫీ చేస్తామని స్వయంగా వ్యవసాయ మంత్రే చెప్పడంతో రైతులంతా మండిపడుతున్నారు. రుణమాఫీ జాబితాలో తమ పేర్లు ప్రకటించకుండా, అప్పులు తెచ్చి బ్యాంకుల్లో జమ చేస్తే మాఫీ రాకపోతే ఎవరిది బాధ్యత అని ప్రశ్నిస్తున్నారు. ముందుగా ఇచ్చిన హామీ మేరకు మాఫీ చేయాలని, ఆ తర్వాత మిగతా డబ్బులను బ్యాంకులో జమ చేస్తామని రైతులు చెబుతున్నారు. అన్ని అర్హతలు ఉన్నా చాలామందికి రూ. 2 లక్షల లోపు రుణాలు మాఫీ కాలేదు. తమకెందుకు మాఫీ వర్తించదని, తామేం పాపం చేశామని వారంతా ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పేదొక్కటి, చేసేది మరొకటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మా ఇంట్లో ఎవరికీ రాలేదు..

నా పేరుమీద గ్రామ శివారుల రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. నిర్మల్‌లోని యూనియన్ బ్యాంకులో లక్షా యాభై వేల పంటరుణం తీసుకున్న. నా చిన్న కొడుకు వినోద్ పేరుమీద కొంత భూమి ఉంటే రూ.45 వేల రుణం తీసుకున్నడు. మా భార్య నర్సవ్వ పేరుమీద రెండెకరాలు ఉండగా, లక్షా యాభై వేల లోన్ తీసుకున్నం. మా ముగ్గురిలో ఏ ఒక్కరికీ కూడా మాఫీ కాలేదు. మూడు విడుతలుగా ఎదురు చూసినం. రుణమాఫీ లిస్టులో మా పేర్లు రాలేదని ఆఫీసర్లు చెబుతున్నరు. మా అందరి పేరుమీద రేషన్‌కార్డు కూడా ఉంది. ఎందుకు మాఫీ కాలేదో చెప్పేవాళ్లే లేరు. నాకే కాదు మా ఊరిలో చాలా మందికి మాఫీ కాలే. గట్టిగా అడిగితే మళ్లీ దరఖాస్తు చేసుకోమంటున్నరు.

-దండు రాజేందర్, రుణమాఫీ కాని రైతు, ఆలూర్

ట్రెజరీలో పెండింగ్ ఉందని అంటున్నరు..

నాకున్న తొమ్మిదెకరాల్లో పంటల సాగు కోసం పీఏసీఎస్ ద్వారా లక్షా డెబ్బై వేల పంటరుణం తీసుకున్న. చివరి జాబితా వరకు ఎదురు చూసిన. మాఫీ లిస్టులో నాపేరు రాలేదు. అన్ని అర్హతలున్నా నాకెందుకు మాఫీ కాలేదని అధికారులను అడిగితే పొంతన లేకుండా మాట్లాడుతున్నరు. రుణమాఫీ డబ్బులు విడుదలయ్యాయి, కాని ట్రెజరీలో పెండింగ్ ఉన్నదని చెబుతున్నరు. ఏమి అర్థం కావడం లేదు. నాకే కాదు ఇలా రకరకాల కారణాలతో గ్రామంలో చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు. ఏ ఇంటికి వెళ్లినా ఇవే బాధలు ఉన్నయ్. లక్ష రూపాయలు మాఫీ చేసినా పర్వాలేదు కాని అందరికీ చేసి ఉంటే బాగుండేది.

-దేశెట్టి ప్రవీణ్, రుణమాఫీ కాని రైతు, ఆలూర్

కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది..

నేను నిర్మల్‌లోని యూనియన్ బ్యాంకులో రెండు లక్షల పంట రుణం తీసుకున్న. మా భార్య పేరుమీద రూ.1.20 లక్షలు, కొడుకు పేరుమీద లక్ష రూపాయల రుణం తీసుకున్నం. ముగ్గురికి వేర్వేరుగా పట్టా పాస్‌బుక్‌లు ఉన్నాయి. ఒకే కుటుంబంగా గుర్తించేందుకు రేషన్‌కార్డు కూడా ఉంది. అయినా ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలేదు. అధికారులను అడిగితే అందరిది కలిపి రూ.4 లక్షలకు పైగా ఉందని, రూ.2 లక్షలపైన ఉన్న డబ్బులను కడితేనే రుణమాఫీ జరుగుతుందని చెబుతున్నరు. అన్ని పైసలు ఇప్పటికిప్పుడు ఎక్కడి నుంచి తేవాలో అర్థం కావడం లేదు. పంట పెట్టుబడి సాయం కూడా రాలేదు. ఇప్పటికే పంట పెట్టుబడి కోసం అప్పులు చేసిన. ఇచ్చిన మాట ప్రకారం ముందు రెండు లక్షలు మాఫీ చేయాలి.

- సోమ రమణయ్య, రుణమాఫీ కాని రైతు, ఆలూర్

రైతులను నిలువునా మోసం చేసింది

నాకు బ్యాంకులో రూ.1.60 లక్షల లోన్ ఉంది. మా భార్య కళావతి పేరుమీద మరో రూ.60 వేల లోన్ ఉంది. ఇద్దరికి పట్టా పాస్ పుస్తకాలు ఉన్నయ్. రేషన్‌కార్డులో మా ఇద్దిరి పేర్లు కూడా ఉన్నయ్. అయినా లోన్ మాఫీ కాలేదు. బ్యాంకుకు పోయి అడిగితే మాకేం తెల్వది, వ్యవసాయ ఆఫీస్‌కు పోయి అడుగుమన్నరు. అక్కడ అడిగితే ఇద్దరిది కలిపి రెండు లక్షలు దాటింది, పైన డబ్బులను కడితేనే రూ.2 లక్షలు మాఫీ అయితయ్ అని ఆఫీసర్లు అంటున్నరు. ఇద్దరిలో ఒక్కరికి అయినా మాఫీ కావాలి. ఎవుసం చేసుకొని బతికెటోళ్లకు ఇన్ని కష్టాలు పెడుతున్నరు. పైసలు కట్టినంక మళ్లా మాఫీ కాకపోతే ఎట్లా. ముందు మాఫీ చేసినంక కొత్త లోన్ ఇచ్చేటప్పుడు మీది పైసలు కట్ చేసుకున్నా పర్వాలేదు.

- గజ్జ పెద్ద లస్మన్న, రుణమాఫీ కాని రైతు, ఆలూర్

రోగులకు మెరుగైన సేవలందించాలి

బోథ్ సీహెచ్‌సీలో రోగి పరిస్థితిని తెలుసుకుంటున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

బోథ్, ఆగస్టు 28 : రోగులకు మెరుగైన సేవలందించాలని, వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్యులు, సిబ్బందికి ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సూచించారు. బుధవారం బోథ్‌లోని సీహెచ్‌సీ, కేజీబీవీ, మోడల్ స్కూళ్లను తనిఖీ చేశారు. సీహెచ్‌సీలో మెటర్నిటీ వార్డులను తనిఖీ చేశారు. అవుట్ రోగుల వివరాలు, వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో చెత్తా చెదారం, మురుగునీటి నిల్వతో దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. అంతకుముందు ఈ నెల 30న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రారంభించనున్న రూ.63 లక్షల నిధులతో నిర్మించిన సబ్ రిజిష్టర్ కార్యాలయ భవనాన్ని సందర్శించారు. ప్రారంభోత్సవంపై అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జేసీ శ్యామలాదేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కృష్ణ, జిల్లా మలేరియా అధికారి మిట్టిపల్లివార్ శ్రీధర్, దవాఖాన సూపరింటెండెంట్ రవీంద్ర ప్రసాద్, తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో జీవన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్, ఏపీవో జగ్దేరావ్ ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఇచ్చోడ, ఆగస్టు 28 : ఇచ్చోడలోని బస్టాండ్ వద్ద ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ పనులను పరిశీలించారు. మహిళల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. త్వరలోనే క్యాంటీన్ ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, ఐకేపీ ఎంపీవో దయాకర్, రెవెన్యూ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆలయాలు నిర్మించిన ఘనత బీఆర్ఎస్ సర్కారుదే

మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం,ఆగస్టు 28: లోకకల్యాణార్థం యాగాలు, ఆలయాలు నిర్మించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని, ఆ ఘనతను ఏ ప్రభుత్వాలూ అందుకోలేవని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని తాటి గూడ హనుమాన్ ఆలయంతో ముఖద్వారం ఏర్పాటు ఉత్సవాలతో పాటు తిరుమలనగర్‌లో నిర్మించిన దక్షిణా మూర్తి హనుమాన్ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాల నిర్మాణంతో పాటు యాగాలు నిర్వహించిన ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కే దక్కిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అశోక్ స్వామి, గణేశ్, దేవదాస్, భోజారెడ్డి, రవి, అశోక్, రవీందర్ రెడ్డి, ఆనందరెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.

బైక్ -ట్రాక్టర్ ఢీ

ఇద్దరి మృతి

లక్ష్మణచాంద (మామడ) ఆగస్టు 28 : మామడ మండలంలోని తాండ్ర గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం..మామడ మండలంలోని వాస్తవపూర్‌కు చెందిన ఆడె శ్యాంరావ్(47), ఆడె సంతోష్(25) ద్విచక్ర వాహనంపై అతివేగంతో వెళ్తూ ఎదురుగా ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. బుధవారం సంఘటన స్థలాన్ని సీఐ నవీన్ కుమార్ సందర్శించారు. శ్యామ్‌రావు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

ఎఫ్‌పీవోలతో రైతులకు మేలు

- కలెక్టర్ అభిలాష అభినవ్
- పెంబిలో రైతు ఉత్పత్తి దారుల సంస్థ ప్రారంభం

ఎఫ్‌పీవోలో చేరిన మహిళా రైతును సన్మానిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

పెంబి, ఆగస్టు 28: రైతు ఉత్పత్తి దారుల సంస్థ (ఎఫ్‌పీవో)లతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో 350 మంది రైతులు కలిసి ఏర్పాటు చేసుకున్న శ్రీ వెంకట సాయి రైతు ఉత్పత్తి దారుల సంస్థ (ఎఫ్‌పీవో)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే దేశం ప్రగతి సాధిస్తుందన్నారు. మారుమూల ప్రాంతమైన పెంబి మండలంలోని 18 గ్రామాల రైతులు ఐకమత్యంతో ఎఫ్‌పీవోను ఏర్పాటు చేయడం సంతోషకరమని అభినందించారు. జిల్లాలో 25 ఎఫ్‌పీవోలు ఉన్నాయని వీటి ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పెంబి ఎఫ్‌పీవో ద్వారా 4000 మంది రైతులకు మేలు జరగనుందన్నారు. ఇందులో మహిళా రైతులకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఎఫ్‌పీవో అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తానని తెలిపారు. పెంబి గ్రామానికి చెందిన విద్యార్థి నవిత కలెక్టర్ ముఖచిత్రాన్ని గీసి కలెక్టర్‌కు బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్, డీఆర్డీవో విజయలక్ష్మి, హార్టికల్చర్ జిల్లా అధికారి రమణ, నాబార్డు డీడీఎం వీరభద్ర, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్, ఎఫ్‌పీవో అధ్యక్షుడు పుప్పాల శంకర్, గౌరవ అధ్యక్షుడు సల్లా రామేశ్వర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చాలి

సమగ్ర శిక్ష ఉద్యోగుల మహా ర్యాలీ

ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఎదులాపురం/నిర్మల్ అర్బన్, ఆగస్టు 28 : అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదిలాబాద్ కలెక్టరేట్ వరకు మహా ర్యాలీ తీసి ధర్నా చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ట్యాంక్ బండ్ నుంచి శివాజీ చౌక్ వరకు శాంతియుతంగా ర్యాలీ తీశారు. ఉద్యోగులు ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రవీందర్ మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు గతంలో ధర్నాలు నిర్వహించిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీకి అనుగుణంగా ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జీవిత బీమా, ఆరోగ్య బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్, తదితర వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ పరమేశ్వర్

రుణమాఫీపై ప్రశ్నిస్తే విమర్శలా?

- మాజీ మంత్రి రామన్నపై వ్యక్తిగత ఆరోపణలు సరికావు
- డీసీసీబీ డైరెక్టర్ పరమేశ్వర్

ఎదులాపురం,ఆగస్టు 28: అర్హులైనప్పటికీ చాలామంది రైతులకు రుణమాఫీ రాకపోవడంతో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి జోగు రామన్నపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ నాయకులు రాబంధుళ్లా వ్యవహరిస్తున్నారని డీసీసీబీ డైరెక్టర్ పరమేశ్వర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాతలకు అన్యాయం జరిగిందన్న ఆవేదనతో వారి పక్షాన నిలబడి పోరాడిన మాజీ మంత్రి జోగురామన్నపై డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఉమ్మడి జిల్లా డీసీసీబీ బ్యాంకు పరిధిలోనే దాదాపు 70శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులకు అండగా నిలబడిన మాజీ మంత్రిపై వ్యక్తిగత దూషణలు చేస్తూ రుణమాఫీని పక్కదోవ పట్టించే ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ఆరోపణలు, దుష్ప్రచారాలు మాని అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ పురుషోత్తం. నాయకులు, కొమ్ర రాజు, నవాతే శ్రీనివాస్. తమల సతీశ్. జవ్వాజీ దయానంద్ పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్ల బోధన

-ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, ఆగస్టు 28 : గిరిజన ఆశ్రమాల్లో విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్ల బోధన ప్రారంభించినట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. బుధవారం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా బోధించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అదేస్థాయిలో బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏసీఎంవో జగన్, జీసీడీవో ఛాయాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.